www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం... తెలుగు దిన పత్రిక

తెలంగాణ | ఆది వారం, 21 ఆగస్టు 2022 | ఎడిటర్ : గోసుకొండ పృద్విరాజు | సంపుటి - 07, సంచిక-130 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak



# మునుగోడు దెబ్బతో బిజెపి దిమ్మ తిరగాలి



- దేశాన్ని భ్రష్టు పట్టిస్తున్న బిజెపి పనిపట్టాలి
- ప్రజా వ్యతిరేక బిజెపితో పోరాటంలో కలసి రావాలి
- ఓటేసే ముందు కరెంట్ మోటర్‌కు, సిలిండర్‌కు దండం పెట్టాలి
- కృష్ణా వాటా తేల్చాలంటూ అమిత్ షా కు సవాల్
- దేశం బాగుపడడాలంటే బిజెపి పోవాలి
- ఇడిల బెదరింపులకు భయపడేది లేదు
- బిజెపి వాళ్లను నమ్మితే పెన్షన్లు కూడా మాయం
- రైతుబంధు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగదు
- మునుగోడును ఆషామాషీగా తీసుకోవద్దు
- దేశాన్ని అమ్ముకుంటున్న దొంగలకు బుద్ది చెప్పాలి
- తెలంగాణ వచ్చాకనే 24 గంటల కరెంట్,మంచినీళ్లు వచ్చాయి
- తెలంగాణ దెబ్బతో దేశానికి మెసేజ్ వెళ్లాలి
- మునుగోడును ఆషామాషీగా తీసుకోవద్దు
- తెలంగాణ దెబ్బతో దేశానికి మెసేజ్ వెళ్లాలి
- దేశాన్ని అమ్ముకుంటున్న దొంగలకు బుద్ది చెప్పాలి
- తెలంగాణ వచ్చాకనే 24 గంటల కరెంట్,మంచినీళ్లు వచ్చాయి
- కాంగ్రెస్‌కు ఓటేసినా లాభం లేదని తెలుసుకోవాలి
- మునుగోడు సభలో ప్రజలకు కెసిఆర్ పిలుపు

**నల్లగొండ, ఆగస్ట్ 20 (సమ సమాజం):** మునుగోడులో జరిగేది ఉప ఎన్నిక కాదు.. బతుకు దెరువు ఎన్నిక అని కేసీఆర్ అన్నారు. మునుగోడులో బీజేపీకి ఓటు పడితే బాయికాడ మీటర్ పడ్తదని అన్నారు. ఇక్కడ ఓటుతో దేశంలో బిజెపికి బుద్ధి చెప్పాలన్నారు. ఓటేసే ముందు ఇంట్లో సిలిండర్‌కు, బాయికాడమోటర్‌కు దండంపెట్టాలని సిఎం కెసిఆర్ అన్నారు. మీటర్లు పెట్టే మోడీ కావాలో లేక మీటర్లు వద్దనే కేసీఆర్ కావాలో ప్రజలే తేల్చుకోవాలని అన్నారు. మునుగోడులో నిర్వహించిన ప్రజా దీవెన సభలో పాల్గొన్న కేసీఆర్ ఉపెన్నిక సమరశంఖం పూరించారు. బిజెపి పాలనాతీరుపై నిప్పులుచెరిగారు. ప్రజలంతా కలిసి బీజేపీకి మీటర్ పెట్టాలని పిలుపునిచ్చారు. ప్రజలు ఇచ్చిన ధైర్యంతోనే బీజేపీతో పోరాడుతున్నానని, తాను బలహీనపడితే మోడీపై ఎట్లా కొట్లాడాలని ప్రశ్నించారు. తెలంగాణకు కొట్లాడటం కొత్త కాదన్న ముఖ్యమంత్రి యాడదాకైనా కొట్లాడేందుకు సిద్ధమని ప్రకటించారు. ఎవరి సంక్షేమం కోసం ఉప ఎన్నిక వచ్చిందన్న విషయాన్ని జనం గ్రహించాలని కోరారు. బీజేపీని గద్దె దించేందుకు క్రియాశీల, ప్రగతిశీల శక్తులన్నీ ఏకం కావాలని సీఎం కేసీఆర్ పిలుపునిచ్చారు. 8 ఏండ్లలో బీజేపీ ఒక్క మంచి పనైనా చేసిందా అని కేసీఆర్ ప్రశ్నించారు. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాను కేంద్రం ఎందుకు తేల్చడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆదివారం జరగనున్న బీజేపీ సభలో కేంద్ర మంత్రి అమిత్ షా తాను అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలకు మేలు చేయకపోగా.. ప్రభుత్వ సంస్థల్ని అమ్ముతున్నరని మండిపడ్డారు. ప్రజల చేతుల్లో ఉండే ఒకే ఒక ఆయుధం ఓటని, దాని ద్వార నిర్మాణమయ్యే శక్తి అని, మనకు ఉపయోగపడుతదా? పడదా? ఆలోచించి ఓటు వేయాలని సీఎం కేసీఆర్ అన్నారు.'మునుగోడు నియోజకర్గం ఒకనాడు ఫ్లోరైడ్ నీళ్లతోని నడుములు వంగి పోయి.. ఏవిధంగా బాధపడ్డదో నేను చెప్పాల్సిన అవసరం లేదు.

మిగతా 2వ

# ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న టిఆర్ఎస్, బిజెపి

ఎనిమిదేళ్లలో ఒక్క సమస్య పరిష్కారం కాలేదు • పిసిసి చీఫ్ రేవంత్ రెడ్డి మండిపాటు



**నల్లగొండ, ఆగస్ట్ 20 (సమ సమాజం):** సీఎం కేసీఆర్ చేస్తున్న తప్పులే రాష్ట్రంలో బీజేపీ చేస్తోందని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి అన్నారు. శనివారం చౌటుప్పల్‌లో మీడియాతో మాట్లాడుతూ... ఎనిమిదేళ్ల టీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క సమస్యను కూడా పరిష్కరించలేదని తెలిపారు. కేసీఆర్ సిగ్గులేకుండా ఓట్ల కోసం మునుగోడుకు వస్తున్నారని మండిపడ్డారు. ప్రతిపక్ష పార్టీలను నిర్వీర్యం చేయడమనే విషప్రయోగం చేస్తున్నారని అన్నారు. ప్రతిపక్షాలలో గెలిచిన వారిని కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రశ్నించే గొంతులను కేసీఆర్ అణచివేస్తున్నారని రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మునుగోడులో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని రేవంత్ రెడ్డి ప్రజలను కోరారు. రాజీనామా చేస్తే నిధులొస్తాయంటున్న భాజపా... వారి ఎంపీలను ఎందుకు రాజీనామా చేయించట్లేదని రేవంత్ ప్రశ్నించారు. రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా నారాయణపూర్ మండలంలో చేపట్టిన పాల్గొని పార్టీ జెండా ఆవిష్కరించి ఉత్సవాలు ప్రారంభించారు. భాజపా, తెరాస తోడు దొంగలుగా మారి.. ప్రజాస్వామ్యాన్ని హత్యచేస్తున్నారని రేవంత్ రెడ్డి

మిగతా 2వ

# మునుగోడులోనూ హుజూరాబాద్ ఫలితమే

- రాజగోపాల్ రెడ్డి వెంటే నియోజకవర్గ ప్రజలు
- కెసిఆర్ కుటుంబం కుర్చీ వేసుకుని కూర్చున్నా గెలవరు
- కెసిఆర్‌ను తరిమికొట్టే రోజులు దగ్గర పడ్డాయి
- అమిత్ షా సభ ఏర్పాట్లను పరిశీలించిన కిషన్ రెడ్డి, ఈటెల

**నల్లగొండ, ఆగస్ట్ 20 (సమ సమాజం):** కేసీఆర్ కుటుంబం మొత్తం కుర్చీ వేసుకుని కూర్చున్నా మునుగోడులో టీఆర్ఎస్ గెలవదని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. తెలంగాణలో కుటుంబ పాలన చేస్తున్న కెసిఆర్ ఉద్యమ హామీలను విస్మరించి ప్రజలను మోసం చేశారని అన్నారు. ప్రజాద్రోహంచేసిన టిఆర్ఎస్‌కు గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఆదివారం మునుగోడులో జరిగే బీజేపీ బహిరంగ సభ ఏర్పాట్లను కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌లు శనివారం పరిశీలించారు. అనంతరం కేంద్రమంత్రి మాట్లాడుతూ... మునుగోడు ఉప ఎన్నికలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గెలుపును ఎవరూ ఆపలేరని, నియోజకవర్గం ప్రజలు రాజగోపాల్ రెడ్డి వైపే ఉన్నారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. దుబ్బాక, హుజురాబాద్ ఉప ఎన్నికల్లో వచ్చిన ఫలితాలే మునుగోడులోనూ వస్తాయని చెప్పారు. ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రజలు టీఆర్ఎస్ ను తరిమికొట్టే రోజులు దగ్గర

మిగతా 2వ



# సుప్రీం చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణకు గౌరవ డాక్టరేట్

- ఆచార్య నాగార్జున వర్సిటీ స్నాతకోత్సవంలో అందచేత
- గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ చేతుల మీదుగా ప్రదానం
- లా చదువుకున్న వర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్న రమణ
- కాలేజీ నాటి అనుభవాలను నెమరేసుకున్న జస్టిస్ రమణ

**గుంటూరు, ఆగస్ట్ 20 (సమ సమాజం):** ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణకు వర్శిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. 37, 38వ స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. ఛాన్సలర్ అయిన గవర్నర్ బిశ్వభూషణెల్చితుల మీదుగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి. రమణకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. స్నాతకోత్సవాలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన జస్టిస్ ఎన్.వి. రమణను గౌరవ

మిగతా 2వ



# మునవార్ షో పరిణామాలకు కెటిఆర్, డిజిపిలదే బాధ్యత



- హిందూ దేవుళ్లను కించపరిచే వారికి ప్రోత్సాహమా
- మండిపడ్డ ఎమ్మెల్యే రాజాసింగ్

**హైదరాబాద్, ఆగస్ట్ 20 (సమ సమాజం):** తెలంగాణలో హిందూ వ్యతిరేక ప్రభుత్వం ఉందని ఎమ్మెల్యే రాజాసింగ్ ధ్వజమెత్తారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ స్టాండప్ కమెడియన్ మునావర్ ఫారుఖీ కామెడీ షో జరిగితే జరగబోయే పరిణామాలకు డీజీపీ మహేందర్‌రెడ్డి, మంత్రి కేటీఆర్‌దే బాధ్యత వహించాలన్నారు. డీజీపీ, కేటీఆర్‌కు అంతగా కామెడీ కావాలంటే.. తెలుగు నటులతో కామెడీ షోలు చేసుకోవచ్చని సూచించారు. రాముడు కోసం తాను చావటానికైనా సిద్ధమని ప్రకటించారు. ఈనెల 22న తాను చేసే కామెడీ షోతో భారతదేశం షేక్ అవుతుందన్నారు. తన పోరాటానికి బీజేపీ పార్టీ మద్దతు లేదనటం అవాస్తవమని రాజాసింగ్ చెప్పారు. హిందూ సంఘాల అభ్యంతరాలు, ఫిర్యాదులు, రాజాసింగ్ హెచ్చరికల నడుమ మునావర్ ఫారూఖీ కామెడీ షో శనివారం జరగనుంది. ఇందుకోసం నిర్వాహకులు పోలీసు శాఖ నుంచి అనుమతి తీసుకున్నారు. దీంతో శిల్పకళా వేదికలో నిర్వహించనున్న ఈ షోకు పోలీసులు

మిగతా 2వ

## సంపాదకీయం

### స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని కొనసాగించాలి !

భారతదేశం స్వాతంత్ర్యోత్సవాలను పురస్కరించుకుని 75 ఏళ్ళు అవుతున్న సందర్భంగా దేశ విదేశాల్లో నూ వజ్రోత్సవ వేడుకలు అంబరాన్ని అంటాయి. ఊరూవా మువ్వన్నెల జెండా రెపరెప లాడింది. ప్రజలు తమ దేశభక్తిని మనసారా చాటారు. ఈ స్ఫూర్తిని ఇంకా ముందుకు తీసుకుని పోవాలి. పాలకులు ఇక తమ రాజకీయాలను పక్కన పెట్టి దేశం కోసం శ్రమించాల్సిన సమయమిది. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామాజిక, ఆర్థిక న్యాయానికి విలువనిచ్చే అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, పౌర గ్రూపులు స్వార్థపర రాజకీయశక్తులతో పోరాడేందుకు సమైక్యంగా కృషి చేయాలి. అప్పుడే పోరాటయోధులు సాధించి పెట్టిన స్వాతంత్ర్య లక్ష్యాలను ముందుకు తీసుకెళ్ళగలుగుతాం. ఆధునిక కాలంలో ఒక స్వతంత్ర దేశం సాధించిన పురోగతిని అంచనా వేయడానికి ఏడున్నర దశాబ్దాల సుదీర్ఘ కాలం సరిగ్గా సరిపోతుంది. మనం సంబరంగా జరుపుకుంటున్న ఈ వజ్రోత్సవాలను పునఃసమీక్షించుకుని ముందుకు సాగాల్సి ఉంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వజ్రోత్సవాలను జరుపు కొంటున్నాం. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత శాస్త్ర సాంకేతిక రంగాలలో ఎంతో అభివృద్ధిని సాధించాం. ఆర్థికంగా కూడా పురోగమించాం. 1947లో స్వాతంత్ర్యం వచ్చినప్పుడు మన దేశ వార్షిక బడ్జెట్ 250 కోట్లు దాటలేదు. ఇందులో దాదాపు 30 కోట్ల ద్రవ్యలోటు ఉంది. ఇప్పుడు దేశ వార్షిక బడ్జెట్ దాదాపు 30 లక్షల కోట్ల వరకు ఉంది. వార్షిక ఆదాయం 170 కోట్ల వరకు మాత్రమే ఉన్నప్పటికీ నాటి పాలకులు ప్రభుత్వ రంగ సంస్థలను, సాగునీటి ప్రాజెక్టులను చేపట్టారు. పంచవర్ష ప్రణాళికల ద్వారా వాటిని పూర్తి చేశారు. ఇప్పుడు ప్రభుత్వ ఆదాయం ఇబ్బడిముబ్బడిగా పెరిగినప్పటికీ దశాబ్దాల క్రితం ఏర్పాటైన ప్రభుత్వరంగ సంస్థలను అమ్ముకుంటున్నాం. ఉపాధి ఉద్యోగ రంగాలను దెబ్బతీస్తున్నాం. దేశం అభివృద్ధి పథంలో పరుగులు తీస్తోందని చెప్పు కొంటున్న పాలకులే పేదరికం పేరిట ఉచిత పథకాలకు తెర తీస్తున్నారు. మరోవైపు లక్షల కోట్ల కార్పోరేట్ రుణాలను మాఫీచేస్తున్నాం. మన నాయకులు కూడా నైతికంగా పతనమవుతూ వచ్చారు. అధికారమే పరమావధిగా రాజకీయాలు రాజ్యమేలుతున్నాయి. అధికారం కోసం సమాజాన్ని కులాలు, మతాల పేరిట ముక్కలు చెక్కలు చేశారు. తప్పుడు పనులు చేసే వారు కూడా కులాన్ని రక్షణ కవచంగా వాడుకోవడం మొదలెట్టారు. వజ్రోత్సవాల సందర్భంగా మన పతనాన్ని చూస్తే ఆవేదనే మిగులుతుంది. ఇప్పుడు రాష్ట్రాల్లో గానీ, కేంద్రంలో గానీ అధికారంలో ఉన్నవారెవరూ 1947కి ముందు పుట్టినవాళ్లు కారు. ప్రజా జీవితంలో ఉన్నత ప్రమాణాలు అంటే ఎలా ఉంటాయో చెప్పేవారు కూడా లేరు. ఎవరైనా చెప్పడానికి ప్రయత్నించినా ఎగతాళికి గురవుతున్నారు. అత్యంత దుర్భరమైన దారిద్ర్యం నెలకొన్న, వ్యాధులతో కునారిల్లుతున్న, నిరక్షరాస్యులైన ప్రజలతో నిండిన ఒక దేశంలో ఆధునిక పెట్టుబడిదారీ వ్యవస్థను నిర్మించాలని భారతదేశంలో అధికారంలోకి వచ్చిన కొత్త పాలక వర్గాలు భావించాయి. రెండు శతాబ్దాల పాటు సాగిన వలస పాలనతో దేశం మొత్తంగా కుంగుబాటుకు గురైంది. అభివృద్ధి వెనుకపట్టు పట్టింది. స్వాతంత్ర్యానికి ముందు అర్ధ శతాబ్దంలో వ్యవసాయ జనాభా తలసరి ఆదాయం పూర్తిగా క్షీణించింది. 1950లో రాజ్యాంగాన్ని ఆమోదించడం, పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థను ఏర్పాటు చేయడం స్వతంత్ర భారతదేశం సాధించిన ముఖ్యమైన విజయం. నయా ఉదారవాద విధానాలకు మారడంతో, మూడు దశాబ్దాల క్రితం వరుసగా వచ్చిన ప్రభుత్వాలు సంపన్నులను మరింత సంపన్నులుగా తయారు చేసే అభివృద్ధి పంథాను పెంచి పోషిస్తూ వచ్చాయి. బూర్జువా సంస్థలకు, వారితో కుమ్మక్కైన - అంతర్జాతీయ ఆర్థిక పెట్టుబడిదారులకు అనుకూలంగా లొంగి వుండేటువంటి విధానాల రూపకల్పన పెరుగుతూ వచ్చింది. మోడీ ప్రభుత్వం కూడా గత ఎనిమిదేళ్ళ కాలంలో నయా ఉదారవాద విధానాలను దూకుడుగా అమలు చేసింది. దీనివల్ల పరిస్థితులు మరింత అధ్వాన్నంగా మారాయి. 2011లో కేవలం 55 మందిగా వున్న శత కోటీశ్వరుల సంఖ్య 2021లో 140కి పెరిగింది. వీరి ఆస్తుల మొత్తం విలువ 59,600 కోట్ల డాలర్లకు చేరింది. ఇది జిడిపిలో 19.6 శాతంగా వుంది. ప్రజారోగ్య వ్యవస్థ, ప్రభుత్వ విద్యా వ్యవస్థల్లో అభివృద్ధి, విస్తరణకు సంబంధించి వైఫల్యం నెలకొంది. ఇన్నేళ్ల తర్వాత కూడా, ప్రజారోగ్యంపై పెట్టే ఖర్చు జిడిపిలో కేవలం ఒకే ఒక్క శాతంగా వుంది. ప్రపంచంలోనే చాలా వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ మనదేనంటూ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నా రూపాయి పతనాన్ని అడ్డుకోలేక పోతున్నాం. ఆర్థిక, సామాజిక ప్రజాస్వామ్యం లేకుండా రాజకీయ ప్రజాస్వామ్యం సఫలీకృతం కాలేదంటూ రాజ్యాంగం తుది ముసాయి దాను ఆమోదించిన సమయంలోనే 1949లో రాజ్యాంగ నిర్ణాయక అసెంబ్లీలో డాక్టర్ అంబేద్కర్ హెచ్చరించారు. బడా కార్పొరేట్ సొమ్ము రాజకీయ వ్యవస్థను కాలుష్యం చేస్తోంది. స్వాతంత్ర్యో ద్యమం ద్వారా ప్రజలు సాధించిందీ, రాజ్యాంగంలో పొందుపరచబడిన విలువలు అన్నీ కూడా తీవ్ర దిగ్బంధాన్ని ఎదుర్కొంటున్నాయి. మరింత మెరుగైన జీవితం కావాలన్న ప్రజల ఆకాంక్షలునెరవేరడం లేదు. బతకడమే భారంగా మారేలా విధానాలు ఉన్నాయి. మెరుగైన పాలన కోసం అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, పౌర గ్రూపులు సమైక్యంగా వుండేందుకు ప్రయత్నాలు చేయాలి. అప్పుడే స్వాతంత్ర ఉద్యమ లక్ష్యాలను ముందుకు తీసుకెళ్ళగలుగుతాం. దేశాన్ని వేగంగా ముందుకు తీసుకుని వెళ్లగలం. కార్పోరేట్లకు దోచిపెట్టే దేశ సంపదను అడ్డుకోవాల్సిందే. అప్పుడే ప్రజలకు ఈ దేశ ఆస్తులపై హక్కు లభిస్తుంది. అందరికీ ఆహారం, కూడు, గుడ్డా, నివాసం వంటి లక్ష్యాలను చేరుకోవాలి. ఉద్యోగం లేదా ఉపాధి అన్నది హక్కుగా రావాలి. ప్రజలు పన్నుల రూపంలో కడుతున్న డబ్బును దుబారా చేయకుండా నిరోధించాలి. పాలకులు తమ జేబులోంచి ఇస్తున్నట్లుగా చేస్తున్న పందేరాలకు అడ్డుకట్ట వేయాలి. అభివృద్ధి పనులకే సొమ్మును వినియోగించాలి. ఈ దిశగా పోరాటం నిరంతరాయంగా సాగాలి. ఇందుకు స్వాతంత్రోద్యమ స్ఫూర్తితో పనిచేయాలి.

పృద్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# మునుగోడు దెబ్బతో బిజెపి దిమ్మ తిరగాలి



(మొదటి పేజీ తరువాయి) కేసీఆర్‌కన్నా ముందు.. కేసీఆర్ దొడ్డు, ఎత్తు ఉన్నవాళ్లు ఎంతోమంది ముఖ్యమంత్రులు అయ్యారు. ఆనాడు ఇదే జిల్లా బిడ్డ సత్యనారాయణ ఉద్యోగానికి రాజీనామా చేసి జలసాధన పోరాటం చేసి ఆనాడున్న ప్రధానమంత్రి ముందుపడుకోబెట్టి అయ్యా మా బతుకు ఇది అంటే.. ఎవడూ మన మొర వినలేదని గుర్తుచేశారు. ఆ తదనంతరం.. నేనే తెలంగాణ ఉద్యమం ప్రారంభించిన తర్వాత.. మంత్రి జగదీశ్‌రెడ్డి చెప్పినట్టు రాష్ట్రమంతా మీ బాధ గురించి చెప్తుతూ వచ్చిన. అంశాల స్వామికావచ్చు, ఫ్లోరైడ్ బాధితులు కావొచ్చు.. దేశ, విదేశాల నుంచి వచ్చి చూస్తా ఉంటే వాళ్ల నిరసన తెలిపి, బాధను వ్యక్తం చేశారు. మే ప్రదర్శన వస్తువులమా? మమ్మల్ని అవమాన పరుస్తున్నరు.. రాకండి.. మీకు దమ్ముంటే సమస్య పరిష్కరించండి అని తిట్టి పంపారు. తెలంగాణ ఉద్యమంలో భాగంగా నల్లగొండ నగారా అని పేరుతో పది రోజుల పాటు జిల్లామొత్తం తిరిగి ఫ్లోరైడ్ మీద చైతన్య పరచడం జరిగింది. శివన్నగూడెం గ్రామంలో నిద్రకూడా చేశాను. ఏమయనే నల్లగొండ.. అనే మాట గూడ చెప్పడం జరిగింది. అనేక ప్రభుత్వ, అనేక పార్టీలు, అనేక రాజకీయాల తర్వాత మనందరి పోరాటాల ఫలితంగా.. మన తెలంగాణకు వస్తే.. ఇవాళ జీరో ఫ్లోరైడ్.. ఫ్లోరైడ్ రహిత మునుగోడు, నల్లగొండగా మిషన్ భగీరథ పథకంతో మార్చుకున్నామని అన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నల్లగొండ జిల్లా సరైన ప్రయత్నాలు జరుగపోతే మానవ నివాసయోగ్యం కాకుండా పోతుందని, నో మ్యాన్ జోన్ అవుతుందని, ఇక్కడ మనుషులు నివసించలేరు.. ఇక్కడ శుద్ధి చేసిన నీళ్లు ఇవ్వాలి. ఇక్కడ పండే పంటలు తింటే కూడా ప్రమాదమే అని చెప్పింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ చెప్పినా.. ఆ నాడు రాష్ట్ర, దేశ పాలకులు పట్టించుకోలేదు. మంచినీళ్లయితే కిందపడి మీదపడి తెచ్చుకున్నం. ఒక బాధ పోయింది. సాగుకు నీళ్లు రావాలి. ఎక్కడి నుంచి రావాలి.. నల్గొండ జిల్లా ఉండేది కృష్ణ బేసిన్‌లో.. శివన్నగూడెం ప్రాజెక్టు రావాలి.. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి తీసుకొని లిఫ్ట్ ద్వారా నింపుకోవాలి. దాని ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తున్నం. ఎన్నికలు రాంగనే ఆగమాగం కావొద్దు.. మన చేతుల్లో ఉన్న అధికారాన్ని ఎవరికో అప్పచెప్పి ఎవరో.. పోరాటం చేయమంటే చేయరు. ప్రజల చేతుల్లో ఉండే ఒకేఒక ఆయుధం ఓటు. దాని ద్వార నిర్మాణమయ్యే శక్తి.. మనకు ఉపయోగపడుతదా? పడదా? ఆలోచించి ఓటు వేయాలన్నారు. మన చుట్టూ ఏం జరుగుతుందో చర్చ పెట్టాలి.. ఆ చర్చలో భాగంగానే ఈ రోజు దేశంలో జరిగే వ్యవహారాలు, ప్రజావ్యతిరేక వ్యవహారాలకు, సమాజాన్ని చీల్చిచెండాడే విద్వేష విధానాలకు వ్యతిరేకంగా పోరాటం జరుగాల్సి ఉందని జాతీయ, రాష్ట్రస్థాయి కమ్యూనిస్ట్ నాయకులు, ఇతర పార్టీల నేతలతో చర్చలు జరుపుతున్నారు. గత ఐదారు మాసాలు తలకాయ అంతా పలగొట్టుకుంటున్నమ్. ఈ దేశాన్ని ఎలా కాపాడుకోవాలని ఆలోచన చేస్తున్నం. అందులో భాగంగా ఎక్కడ విధంగా ఏరాపేరి గోల్‌మాల్ ఉప ఎన్నిక వచ్చిందో తెలుసు. ఏ అక్కర ఉండి వచ్చింది ఇక్కడ ఉప ఎన్నిక' అని సీఎం కేసీఆర్ ప్రశ్నించారు. సభలో సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. అమిత్‌షాను టార్గెట్ చేశారు. ఆదివారం జరిగే సభలో కృష్ణా జలాలపై అమిత్‌షా తన వైఖరి చెప్పాలని డిమాండ్ చేశారు. ఎందుకు కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా తేల్చడం లేదో అమిత్‌షా చెప్పాలని అన్నారు. మరో ఏడాదిలో ఎన్నికలు ఉండగా.. రాజగోపాల్ రెడ్డి ఎవరి కోసం రాజీనామా చేసి ఉప ఎన్నికకు పోతున్నాడని ప్రశ్నించారు. 8 ఏళ్ల పాలనలో ఏ వర్గానికి మేలు జరిగింది. బ్యాంకులు, రైళ్లు, రోడ్లు అన్నింటినీ కేంద్రం అమ్మేస్తోంది. ఇక రైతులు, భూములను కూడా మోదీ సర్కార్ అమ్మేస్తుందేమో. మాకు మద్దతు ఇచ్చిన సీపీఐకు ధన్యవాదాలు. మునుగోడు నుంచి ఢిల్లీ దాకా కామ్రేడ్లతో ఐక్యత కొనసాగించాలి. రైతులు తస్మాత్ జాగ్రత్త. మోదీ దోస్తులు సూట్ కేసులు పట్టుకొని రెడీగా ఉన్నారు. లక్షమందికి పైగా రైతులకు రైతుబంధు ఇస్తున్నాం రైతు బంధు ఎట్టిపరిస్థితిలోనూ ఆగదు. పల్లా వెంకటరెడ్డి గారు చెప్పినట్లు చిన్న చిన్న విషయాలు పక్కనపెడితే.. దేశం జీవిక దెబ్బతినే ప్రమాదం ఉంది. అందుకే సీపీఐ పార్టీలో చర్చలు జరిపి, వాళ్లు పోటీ చేయకుండా మన టీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వాలని నిర్ణయించారు. అందుకోసం వారికి ప్రజల తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నా. ఈ పోరాటం ఈరోజుతో ముగిసేది కాదు. మునుగోడు నుంచి ఢిల్లీ దాకా మన స్నేహం కొనసాగాలి. టీఆర్ఎస్ వంటి ప్రగతిశీల శక్తులన్నీ కలిసి పోరాడతాయని మాటిస్తున్నా అని కెసిఆర్ అన్నారు. దేశంలో కొత్త రాష్ట్రం ఏర్పడితే మన హక్కులు మనకు రావాలి. అన్నదమ్ములు విడిపోతే పంచుకోరా? ఇప్పుడు మన రాష్ట్రం ఏర్పడి 8 ఏండ్లు అవుతోంది. అయ్యా.. ఈ కృష్ణా నదిలో మా వాటా తేల్చండి అని అడిగితే సమాధానం చెప్పరు. ఎన్ని ఇస్తే అన్నే ఇవ్వు. కానీ వాటా చెప్పు అంటే నరేంద్ర మోదీ చెప్పడు. మా నీళ్లలో వాటా ఇవ్వనందుకే రేపు మునుగోడుకు వస్తున్నావా అమిత్ షా? సమాధానం చెప్పు. నీ బొమ్మలు కాదు. నీ తాత జేజమ్మల బొమ్మలు కూడా మేం చూశాం. కొట్లాటలు తెలంగాణకు కొత్త కాదు. కొట్లాట మొదలైతే ఎంత దూరమైనా పోతాం. ఇలాంటి బొమ్మలు కాదు. ఎందుకు కృష్ణా జలాల్లో మా వాటా తేల్చడం లేదు? సమాధానం చెప్పు' అని అమిత్‌షాను ప్రశ్నించారు. పంద్రాగస్టును ప్రధాని మాట్లాడితే మైకులు పగిలిపోయాయి. నీళ్ల వాటా తేలిస్తే చకచకా నీళ్లు తెచ్చుకుంటాం. తేలిన చోట గోదావరి నుంచి తెచ్చుకున్నాం. తుంగతుర్తి, కోదాడల్లో గోదావరి నీళ్లు పారి లక్షల టన్నుల దిగుబడి వస్తోంది. బసవాపురం ప్రాజెక్టు పూర్తయింది. ఆలేరు, భువనగిరి, రామన్నపేటలకు కూడా వర్షాకాలం తర్వాత నీళు వస్తాయి. ఇక్కడ కూడా రావాలని పనులు మొదలు పెడితే.. ఎందుకు అడ్డంకులు పెడుతున్నారు? పెద్ద పెద్ద మాటలు మాట్లాడే రాజగోపాల్ రెడ్డినో, కేంద్ర మంత్రో, ఇంకో పెద్ద మనుషో ఢిల్లీకి పోయి మా కృష్ణా జలాలా వాటా ఏంటి? మా శివన్నగూడెం ప్రాజెక్టు ఎప్పుడు నింపుకోవాలి? అని అడగరట. కానీ రేపు డోల్ బాజా పట్టుకొని అమిత్‌షాను తీసు కొస్తారట. ఎవడికి కావాలి నీ డోల్ బాజా, భజంత్రీ, నీ పెద్దపెద్ద బొమ్మలు? మునుగోడు చైతన్యవంత మైన గడ్డ. కృష్ణా జలాల వాటా ఎందుకు తేల్చరో? కేంద్ర ప్రభుత్వ పాలసీ ఏంటో? మీ దద్దమ్మ చేతగానితనమేంటో మునుగోడులో చెప్పాలని సవాల్ చేస్తున్నా. ఒక్క విషయం ఆలోచించండి.. బీజేపీ ప్రభుత్వం వచ్చి 8 ఏండ్లు అయింది. రైతులకు కానీ, మహిళలకు కానీ, దళితులకు కానీ, కార్మికులకు కానీ ఎవరికైనా ఒక్క మంచి పని జరిగిందా? వాళ్లకు మేలు జరిగితే మాకు కనిపించదా? అవి లేవుకానీ.. ఎయిర్‌పోర్టులు, విమానాలు, బ్యాంకులు, రైళ్లు, రోడ్లు, గ్యాస్ కంపెనీలు అన్ని వరుసపెట్టి అమ్మడం మొదలు పెట్టారు. కార్పొరేట్ వ్యవసాయం చేద్దాం అని చెప్పి రైతుల పొలాల్లో రైతులనే కూలీలుగా పనిచేయించే కుట్ర జరుగుతోంది. తస్మాత్ జాగ్రత్త. చిన్నరైతు, పెద్ద రైతు అని లేకుండా అందరికీ లక్షమందికిపైగా రైతు బంధు పథకం అందుతోంది. లక్షమంది రైతులకు ఎంత భూమి ఉంటే అంత అందుతోందన్నారు. వడ్లు కొనుగోలు గురించి గొడవ జరిగే సమయంలో జగదీశ్వర్ రెడ్డి, మేం ఎమ్మెల్యేలంతా వెళ్లి ఢిల్లీలో గొడవ చేసినా వడ్లు కొనం అన్నారు. ఫుడ్ కార్పొరేషన్‌ను చేతులో పెట్టుకొని ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతుంటే మేం ఏం చెయ్యాలి? విలేకరులు లేకుండా చూసి తలుపు పెట్టి పైసలు బర్బాద్ చేస్తున్నారు? రైతులకు ఎందుకు ఇస్తున్నారు? వికలాంగులకు, చేనేతకార్మికులకు, గీత కార్మికులకు, ముసలోళ్లకు ఇవ్వొద్దు అంటారు. వీళ్లందరి నోరు కొట్టి బడా బడా షావుకార్లకు ఇవ్వాలి. ఇదే దేశంలో జరుగుతోంది. నేను చెప్పేది నిజమో కాదో మీ గ్రామంలోకి వెళ్లి ఆలోచించండి. రైతు బంధు అని చెప్పా అందరికీ వస్తోంది. రైతు బీమా అందరికీ వస్తోంది. ఎవరైనా రైతు చనిపోతే ఆ కుటుంబం రోడ్డున పడేది. కానీ ఇప్పుడు రైతు ఏ కారణం వల్ల చనిపోయినా పది రోజులు కూడా తిరగకుండానే వాళ్ల ఖాతాలో రూ.5 లక్షలు పడుతోందని కేసీఆర్ ధ్వజమెత్తారు. అంతకుముందు భారీ కాన్వాయ్‌తో మునుగోడులో టీఆర్ఎస్ ప్రజాదీవెన సభకు సీఎం కేసీఆర్ చేరుకున్నారు. సభా వేదికపై పార్టీ జెండా ఆవిష్కరించారు. వేదికపై అమరవీరుల స్థుపానికి నివాళులు అర్పించారు. ప్రజాదీవెన సభకు సీఎం కేసీఆర్‌తోపాటు మంత్రులు, నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. హైదరాబాద్ ప్రగతి భవన్ నుంచి బయలుదేరిన సీఎం కేసీఆర్.. పార్టీ శ్రేణులతో కలిసి బస్సులో మునుగోడు వెళ్లారు. సీఎం వెళ్లే మార్గమంతా టీఆర్ఎస్ పార్టీ జెండాలు, ఫ్లెక్సీలతో సందడిగా నెలకొంది.

## ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న టిఆర్ఎస్, బిజెపి

(మొదటి పేజీ తరువాయి) ఆరోపించారు. రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా... నియోజకవర్గంలోని 175 గ్రామాల్లో వేడుకలు నిర్వహిస్తున్నారు. ఇంటింటికి తిరుగుతూ పండ్లు పంపిణీ చేశారు. అనంతరం చౌటుప్పల్‌లో వివిధ పార్టీల నేతలకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాజీనామా చేస్తే నిధులొస్తాయంటున్న భాజపా... వారి ఎంపీలను ఎందుకు రాజీనామా చేయించట్లేదని రేవంత్ ప్రశ్నించారు. రాజీనామాతో ఏ గ్రామాలకు నిధులు వచ్చాయో చెప్పాలని ఆయన ధ్వజమెత్తారు. అమ్ముడుపోయిన వాళ్లంతా సిద్ధాంతాలు చెప్పడం దారుణమని మండిపడ్డారు. డిండి ప్రాజెక్టు పూర్తిచేయకపోవడం వల్ల మునుగోడుకు అన్యాయం జరిగిందని రేవంత్ పేర్కొన్నారు. రాజీనామాల ద్వారానే నిధులు వస్తాయని భాజపా చెప్తోంది. అలాంటప్పుడు భాజపా ఎంపీలను రాజీనామా చేయించి నిధులు తీసుకురండి. రాజీనామాతో ఏ గ్రామాలకు నిధులు వచ్చాయో చెప్పండి. అమ్ముడుపోయిన వాళ్లంతా సిద్ధాంతాలు చెప్పడం దారుణం. భాజపా, తెరాస ప్రజాస్వామ్యాన్ని హత్య చేస్తున్నారు. ప్రజాస్వామ్యం బతకాలంటే కాంగ్రెస్‌ను గెలిపించండి. యువత చైతన్యంతో కొనుగోలు రాజకీయాలను పాతరేయాలి. ప్రతీ గ్రామంలో ఇంటి ఇంటికి కాంగ్రెస్ స్టిక్కర్లు అంటించాలి. మునుగోడులో మద్దతు ఇవ్వాలని కోదండరాంను కలిశా. ఈ నియోజకవర్గంలోని రైతులకు రూ.300 కోట్ల రుణమాఫీ జరగాలి. పెండింగ్‌లో



ఉన్న పోడుభూముల సమస్య పరిష్కరించండి. పాలమూరు-రంగారెడ్డిని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించాలని రేవంత్ అన్నారు.

## మునుగోడులోనూ హుజూరాబాద్ ఫలితమే

(మొదటి పేజీ తరువాయి) పడ్డాయన్నారు. విలువలకు కట్టుబడి ఉన్న రాజగోపాల్ రెడ్డిని మునుగోడు ఓటర్లు గెలిపిస్తారని, ఇక్కడి ప్రజలు బీజేపీని స్వాగతిస్తున్నారని పేర్కొన్నారు. అధికార పార్టీ అభద్రతాభావం, గందరగోళంలో ఉందన్నారు. అమిత్‌షా సభకు ఒక్కరోజు ముందు కేసీఆర్ సభ పెట్టడం చూస్తుంటే వారి భయాన్ని తెలియజేస్తోందని తెలిపారు. హుజూరాబాద్ గెలుపును ఓర్వలేకే బీజేపీపై తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. మాటలగారడీ చేయడం కేసీఆర్‌కు వెన్నతో పెట్టిన విద్యని అన్నారు. ఉపఎన్నికలు వస్తేనే రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. ఏ విషయంలో దేశానికి తెలంగాణ ఆదర్శమో కేసీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈటలను ఓడించేందుకే దళితబంధు తెచ్చారని... అయినప్పటికీ హుజూరాబాద్ ప్రజలు బీజేపీని గెలిపించారన్నారు. రాజగోపాల్‌రెడ్డి నిర్ణయాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. రేపటి బీజేపీ బహిరంగ సభకు కేంద్ర మంత్రి అమిత్ షా ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. ఈ క్రమంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. టీఆర్ఎస్ అభద్రతా భావంతో ఉందని, ఎన్నికలు ఎప్పుడు వస్తాయో తెలియదు గానీ అధికార పార్టీ మాత్రం గందరగోళంలోనే ఉందన్నారు. అమిత్ షా మీటింగ్ కు ఒకరోజు ముందు కేసీఆర్ సభ నిర్వహిస్తున్నారంటే.. వారిలో ఎంతో భయం ఉందో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. కేసీఆర్ కుటుంబం మొత్తం మునుగోడులో కుర్చీ వేసుకొని కూర్చున్నా టీఆర్ఎస్ గెలవదన్నారు. హుజురాబాద్ ఉప ఎన్నికలో బీజేపీ గెలుపును ఓర్వలేక తమ పార్టీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈటల రాజేందర్ పై టీఆర్ఎస్ అభ్యర్థి గెలిచేందుకు కేసీఆర్ చాలా ఎత్తులు వేశారని, కొత్త పథకాలను కూడా అప్పటికప్పుడు పుట్టుకొచ్చాయన్నారు. మాయమాటలతో ప్రజలను గారడీ చేయడం కేసీఆర్ కు వెన్నతో పెట్టిన విద్య అని అన్నారు. బీజేపీ కుటుంబ పార్టీ కాదని, తమ పార్టీలో అవినీతి లేదని స్పష్టం చేశారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీసుకున్న రాజీనామా నిర్ణయాన్ని బీజేపీతో పాటు ప్రజలందరూ అభినందిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీష్ రావు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజక వర్గాల్లోనే అభివృద్ధి కనిపిస్తోందని, మిగతా నియోజకవర్గాల్లో మాత్రం అభివృద్ధి లేదన్నారు. అధికార పార్టీ నాయకుల ఫామ్ హౌజ్ లు, వాళు పర్యటించే ప్రాంతాల్లోనే అభివృద్ధి ఉంటోందని, మిగతా నియోజక వర్గాలు రాష్ట్రంలో లేవా..? అని ప్రశ్నించారు. టీఆర్ఎస్ పార్టీ దేశానికి ఆదర్శమని చెబుతున్న ఆ పార్టీ నాయకులు ఎందులో ఆదర్శమో చెప్పాలని డిమాండ్ చేశారు. మునుగోడులో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించే భారీ బహిరంగ సభకు అన్ని ఏర్పాట్లు పూర్తవుతున్నాయి. ఈ సభకు ముఖ్యఅతిథిగా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా హాజరుకానున్నారు. పార్టీ నాయకులతో కలిసి సభా స్థలాన్ని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పరిశీలించారు. అమిత్ షా సభకు ఇన్ చార్జ్ గా బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు వివేక్ వెంకటస్వామి, హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఉన్నారు.

## మునవార్ షో పరిణామాలకు కెటిఆర్, డిజిపిలదే బాధ్యత

(మొదటి పేజీ తరువాయి) భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. మునావర్ ఫారూఖీ తన షోలో హిందూ దేవుళ్లపై అనుచిత కామెడీ చేస్తున్నాడని, అతడి షోకు అనుమతిఇవ్వవద్దని పలు హిందూ సంఘాల ప్రతినిధులు డీజీపీకి, సీపీకి ఫిర్యాదులు చేశారు. ఎట్టిపరిస్థితుల్లో మునావర్ షోను ఆపాలని, ఇందుకు అందరూ తరలిరావాలని సోషల్‌మీడియాలో హిందూ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. హిందూ జనజాగృతి సమితి, ధర్మజాగరణ, వీహెచ్‌పీ, హిందూ ఏక్తా తదితర సంస్థ ప్రతినిధులు రవీంద్రభారతి ప్రాంగణంలో సమావేశమై ఈ మేరకు తీర్మానం చేశారు. మునావర్ ఫారుఖీ షోకు అనుమతులు ఉన్నాయన్నాయని మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా షోలు నిర్వహించుకోవచ్చని తెలిపారు. ఎవరైనా అశాంతి సృష్టించాలని చూస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సాయంత్రం షో మొదలై ముగిసే వరకు పోలీసులు అన్నిచోట్ల బందోబస్తు ఉంటుందని డీసీపీ వెల్లడించారు.

## టిఆర్ఎస్ గెలుపుతోనే మునుగోడు అభివృద్ధి

### బహిరంగ సభలో మంత్రి జగదీశ్ రెడ్డి

**నల్లగొండ, ఆగస్ట్ 20 (సమ సమాజం):** టీఆర్ఎస్ గెలిస్తేనే మునుగోడు నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమవుతుందని మంత్రి జగదీశ్ రెడ్డి అన్నారు. నల్గొండ జిల్లా ఎడారిగా మారుతుందని ఆనాడు అందరూ అనుకునేవారని.. సీఎం కేసీఆర్ దార్శనికత వల్లే ఇప్పుడు ఇక్కడి పరిస్థితి మారిందని ఆయన పేర్కొన్నారు. ఫ్లోరైడ్ రక్కసి భయంతో మునుగోడు నుంచి గతంలో వలస వెళ్లిపోయిన వారంతా .. మళ్లీ తిరిగొచ్చారని తెలిపారు. మునుగోడులో జరుగుతున్న టీఆర్ఎస్ బహిరంగ సభలో జగదీశ్ రెడ్డి మాట్లాడారు. ఫ్లోరైడ్ సమస్య పరిష్కారానికి అవసరమైన కోట్లాది రూపాయల నిధులను ఉదారంగా మంజూరు చేసిన ఘనత కేసీఆర్ కే దక్కుతుందన్నారు. ఫ్లోరైడ్ సమస్య దేవుడిచ్చిన శాపం కాదు.. పాలకులు చేసిన ద్రోహం అని దాదాపు రెండు దశాబ్దాల క్రితమే కేసీఆర్ తనతో చెప్పారని జగదీశ్ రెడ్డి ఈసందర్భంగా గుర్తుచేసుకున్నారు. మాటలు చెప్పడమే కాదు.. వాటిని ఆచరించి చూపిన ఘనత సీఎంకే దక్కుతుందన్నారు.

## మునుగోడు కు బయలుదేరిన కెసిఆర్

### భారీ కాన్వాయ్‌తో కదిలిన టిఆర్ఎస్ శ్రేణులు

**హైదరాబాద్, ఆగస్ట్ 20 (సమ సమాజం):** మునుగోడు ప్రజాదీవెన సభకు సీఎం కేసీఆర్ బయలుదేరారు. సీఎం కేసీఆర్‌తోపాటు మంత్రులు, నాయకులు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. హైదరాబాద్ నుంచి మునుగోడు వరకు ఐదువేలకు పైగా కార్లలో భారీ ర్యాలీ చేపట్టారు. ప్రగతి భవన్ నుంచి బస్సులో బయలుదేరిన సీఎం కేసీఆర్‌కు.. ఉప్పల్ చౌరస్తాలో పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. టీఆర్ఎస్ ప్రజాదీవెన సభకు సర్వం సిద్ధమైంది. సభావేదికతోపాటు మునుగోడు మొత్తం గులాబీమయమైంది. ఇప్పటికే భారీ సంఖ్యలో టీఆర్ఎస్ కార్యకర్తలు సభాస్థలికి చేరుకుంటున్నారు. సుమారు లక్షన్నర మంది కూర్చునేలా 25 ఎకరాల్లో సభా ఏర్పాట్లు పూర్తిచేశారు.

# సుప్రీం చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణకు గౌరవ డాక్టరేట్

(మొదటి పేజీ తరువాయి) డాక్టరేట్‌తో యూనివర్శిటీ సత్కరించింది. అనంతరం సీజేఐ విద్యార్థులకు పట్టాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి పూర్వ విద్యార్థి అయిన జస్టిస్ ఎన్.వి.రమణకు ఈ సందర్భంగా గవర్నర్ డాక్టరేట్ ప్రదానం చేశారు. పట్టాలు అందుకున్న విద్యార్థులకు సీజేఐ శుభాకాంక్షలు తెలిపారు. ఆచార్య నాగార్జున వర్సిటీకి గొప్ప చరిత్ర ఉందన్న సీజేఐ.. డాక్టరేట్ ఇచ్చి గౌరవించిన వర్సిటీకి ధన్యవాదాలు తెలిపారు. ఈ వర్సిటీ నుంచి వెళ్లిన చాలామంది వివిధ హోదాల్లో ఉన్నారని గుర్తు చేశారు. వృత్తి విద్యా కోర్సులు అభ్యసించిన వారికి ఎన్నో అవకాశాలు ఉన్నాయన్నారు. ఇదే వర్సిటీలో నేను కూడా చదివా. యూనివర్సిటీ తో నాకు ఎన్నో జ్ఞాపకాలు ఉన్నాయి. మేము చదివేటప్పుడు వర్సిటీలో ఇన్ని గదులు లేవు. క్లాస్‌రూమ్‌ల కంటే క్యాంటీన్‌లోనే ఎక్కువ ఉండేవాళ్లం. గంటల తరబడి క్యాంటీన్‌లో చాలా విషయాలపై చర్చించేవాళ్లం. సమాజంలోని అనేక సమస్యలపై చర్చ జరిపేవాళ్లం. విద్యార్థి సంఘాల సమావేశంలో పలు అంశాలపై చర్చించేవాళ్లం. ప్రజా సమస్యలపై అవగాహన కలిగి.. వాటికి పరిష్కారం చూపగలగాలని అన్నారు. ప్రపంచాన్ని మార్చడానికి విద్యకు మించిన ఆయుధం లేదన్నారు. 16 ఏళ్ల లోపు అందరికీ నిర్బంధ విద్య అమలు చేయాలని చెప్పారు. హిస్టరీ, ఆర్థికశాస్త్రం, హ్యూమనిటీ సబ్జెక్టులపై తీవ్ర నిర్లక్ష్యం ఉందని పేర్కొన్నారు. దేశ సమస్యలపై యూనివర్సిటీలు దృష్టి పెట్టాలని ఎన్వీ రమణ పిలుపునిచ్చారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం లా కోర్సు ప్రథమ బ్యాచ్ విద్యార్థి జస్టిస్ ఎన్వీ రమణ. నేడు ఆయన దేశంలోనే అత్యున్నత న్యాయపీఠాన్ని అధిష్ఠించి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా అక్షరాలు దిద్దిన ప్రాంగణం లోకి అడుగుపెట్టారు. వర్సిటీలో న్యాయ విద్య పూర్తి చేసుకుని అంచెలంచెలుగా ఎదిగారు. ఎక్కడైతే లా కోర్సు చదివారో అక్కడే ఆయన గౌరవ డాక్టరేట్‌ని అందుకున్నారు. జస్టిస్ రమణ ఆగస్టు 27వ తేదీ 1957లో కృష్ణా జిల్లాలోని పొన్నవరంలో సాధారణ వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. సైన్స్, లా కోర్సుల్లో ఆయన గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి తన కుటుంబంలో తొలితరం న్యాయవాది అయ్యారు. బార్ కౌన్సిల్‌లో 1983 ఫిబ్రవరి 10న నమోదై ఏపీ హైకోర్టు, సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్, ఆంధ్రప్రదేశ్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్, సుప్రీం కోర్టులో ప్రాక్టీసు చేశారు. భారతీయ రైల్వేలు వంటి ప్రభుత్వ సంస్థలకు ప్యానెల్ కౌన్సెల్‌గా వ్యవహరించారు. అలానే ఆంధ్రప్రదేశ్‌కు అదనపు అడ్వొకేట్ జనరల్‌గా విధులు నిర్వహించారు. సివిల్, క్రిమినల్ విభాగాల్లో జస్టిస్ ఎన్వీ రమణ నిష్ణాతులుగా ఉన్నారు. రాజ్యాంగం, కార్మికుల హక్కులు, సర్వీసు, అంతరాష్ట్ర జల వివాదాలు, ఎన్నికలు తదితర అంశాలపై కోర్టుల్లో కేసులు వేసి వాదించారు. 2000 జూన్ 27న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు శాశ్వత న్యాయమూర్తిగా నియామకం పొందారు. ఆ తర్వాత స్వల్పకాలం 2013 మార్చి 10 నుంచి మే 20 వరకు హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తిగా విధులు నిర్వహించారు. 2013 సెప్టెంబరు 2న ఢిల్లీ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా బాధ్యతలు నిర్వహిం చిన జస్టిస్ ఎన్వీ రమణ 2014 ఫిబ్రవరి 17న సుప్రీం కోర్టు న్యాయమూర్తి అయ్యారు.

## వీఆర్ఏల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి: మాసన్న నాగరాజు



**పుల్కల్, ఆగస్టు 20 (సమ సమాజం):** సంగారెడ్డి జిల్లా ఆందోలు నియోజకవర్గం బహుజన్ సమాజ్ పార్టీ పుల్కాల్ మండల వి ఆర్ ఏ ల దీక్షకు ఆందోలు నియోజకవర్గ ఇంచార్జి మాసన్న నాగరాజు ఆందోలు నియోజకవర్గ అధ్యక్షుడు మోహన్ గారు ఆందోలు నియోజకవర్గ సోషల్ మీడియా ఇంచార్జి సాయిబాబు మద్దతు ఇవ్వడం జరిగింది. ఆందోల్ నియోజకవర్గ ఇంఛార్జి మాసన్న నాగరాజు మాట్లాడుతూ VRA డిమాండ్లు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నెరవేర్చడమే కాకుండ జీవో 121 ని రద్దుచేసి, వారసత్వ ఉద్యోగాలు కొనసాగించాలి, పే స్కెలు విధానాన్ని ఇస్తామన్న ముఖ్యమంత్రి మాటను నిజం చేయలని కోరరూ. VRA ఉద్యోగస్తులు గ్రామాల పరిస్థితులు ఎప్పటికపుడు ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి ముఖ్య వారధిగా పనిచేస్తారు వారి ఉద్యోగం చినదైనప్పటికి పెద్ద భాద్యతను నిర్వహిస్తారు గ్రామాల భూసమస్యల పరిష్కారంలో ముఖ్య పాత్ర పోషిస్తారు. రాష్ట్రంలో 7039 విఆర్ఏ పోస్టులునాయి వీరంత వారి న్యాయమైన హక్కులకోసం 27 రోజులుగా దీక్ష చేస్తునపటికి ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి హామీ ఇయకపోవటం చాలా బాధాకరం. మరి ఇప్పటికైనా వారి డిమాండ్లు నెరవేర్చలని బహుజన్ సమాజ్ పార్టీ తరుపున ప్రభుతనికి మేము విజ్ఞప్తిచేస్తునమన్నారు

## జాగృతి రాష్ట్ర నాయకునికి తప్పిన ప్రమాదం

**శంషాబాద్ సమీపంలో ఓఆర్ఆర్ పై ఘటన**




**సంగారెడ్డి, ఆగస్టు 20 (సమ సమాజం):** మునుగోడులో జరిగే ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజా దీవెన సభకు ఆందోల్ నియోజకవర్గం నుండి 150 పైగా వాహనాలు భారీ ర్యాలీగా ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ఆధ్వర్యంలో బయలుదేరాయి. టీఆర్ఎస్ నేత మఠం బిక్షపతి కారు ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో ఆయన స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మునుగోడులో టిఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద బహిరంగ సభకు ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి పార్టీ ముఖ్య నాయకులు పెద్ద ఎత్తున కార్లతో తరలివెళ్లారు. పటాన్చెరు నుంచి ఔటర్ రింగ్ రోడ్డు మీదుగా బయలుదేరారు. శంషాబాద్ సమీపంలోకి కాన్వాయ్ వెళ్లగానే బిక్షపతి కారు ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో పార్టీ శ్రేణులు ఆందోళన చెందారు. ఎమ్మెల్యేలు గూడెం మహిపాల్ రెడ్డి, క్రాంతి కిరణ్, ఇతర నాయకులు బిక్షపతిని పలుకరించారు. అనంతరం కాన్వాయ్ ముందుకు సాగింది. బిక్షపతి కారుకు ప్రమాదం జరిగిందన్న విషయం తెలుసుకున్న అతడి సన్నిహితులు, ఆందోల్ నాయకులు ఆయనకు ఫోన్ చేసి పలకరిస్తున్నారు.

## వెలుగు సమైక్య సంఘము ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు



**టేక్మాల్, ఆగస్టు20 (సమ సమాజం):** మెదక్ జిల్లా టేక్మాల్ మండల కేంద్రంలో 75వస్వాతంత్ర్య భారత వజ్రోత్సవాల లో భాగంగా మండల వెలుగు సమైక్య సంఘం ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలను ఎంపీపీ చింతా స్వప్న రవి, సర్పంచ్ సుప్రజా భాస్కర్, ఎంపీటీసీ నిమ్మ వాణి రమేష్, మండల సమైక్య ఎపీయం రామకృష్ణ, ప్రారంభించి ముగ్గులు వేసిన మహిళల పోటీదారులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో పండుగ వాతావరణం నెలకొంది మహిళలు పెద్ద ఎత్తున ముగ్గుల పోటీలలో పాల్గొని 75వ.భారత స్వాతంత్ర్య ఉద్యమంలో మహిళల పాత్ర ఎంతో గొప్పదని వారి సేవలను మనం గుర్తు చేసుకోవాలని ఏంతో మంది మహిళలు ప్రత్యక్షంగా పరోక్షంగా ఉద్యమాన్ని నడిపించారాని మనం కూడా వారి స్ఫూర్తితో ముందుకు సాగాలని ప్రతి రంగంలో మహిళలకు సపూర్ణ మద్దతు లభిస్తుందని దానిని సద్వినియోగం చేసుకోవాలి అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల పట్ల పూర్తి బాధ్యతతో వహిస్తుందని దేశంలోనే మహిళా రక్షణలో మొదటి స్థానంలో ఉంది. దేశంలో ఎవరు ఇవ్వనటువంటి అనేక సంక్షేమ పథకాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుంది అన్నారు ఈకార్యక్రమంలో మండల సమైక్య ఎపీయం రామకృష్ణ, సీసీలు దుర్గయ్య, శ్రీనివాస్ రెడ్డి, జైపాల్ రెడ్డి,స్వరూప,మల్లీక,భారతీ, యాదమ్మ, గ్రామ మహిళా సంఘాల అధ్యక్షులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## టేక్మాల్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా రాజీవ్ గాంధీ జన్మదిన వేడుకలు



**టేక్మాల్, ఆగస్టు20 (సమ సమాజం):** టేక్మాల్ లో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ గారి జన్మదిన వేడుకలు శ్రీ దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు ఘనంగా రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు, అనంతరం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నిమ్మ రమేశ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేయడం జరిగింది అనంతరం నాయకులు మాట్లాడుతూ.. రాజీవ్ గాంధీ ఆధునిక భావాలు నిర్ణయత్మక శక్తి కలిగిన నిర్ణయాలు వల్లే నేడు భారత దేశం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞాన కలిగి ప్రపంచంలో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు, టెలికమ్యూనికేషన్స్ విప్లవంతో దేశాన్ని 21వ శతాబ్దంలోకి తీసుకెళ్లిన దార్శనికుడు రాజీవ్ గాంధీ, ఐటి రంగాన్ని దేశానికి పరిచయం చేసి, ఆ రంగంలో విప్లవాత్మక మార్పులు తేచ్చిన ఘనత ఆయనకే దక్కుతుంది, యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని 18 సంవత్సరాలకే ఓటు హక్కుని కల్పించిన నేత అని బడుగుబాలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చిన రాజీవ్ సమ సమాజ స్థాపన కోసం కృషి చేసారు, విమాన, నౌక యణలకు బీజం వేసాడు, ఎడ్యుకేషన్ పాలసీ తెచ్చిన ఘనత కూడా రాజీవ్ దే, అలా దేశాన్ని అభివృద్ధి బాటలో నడిపించిన మహా యోధుడు మన రాజీవ్ గాంధీ అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాపయ్య,కిషోర్, కో ఆప్షన్ మెంబర్ మజార్, రాజు, సేవాలాల్, దుర్గయ్య, లక్ష్మణ్ ప్రసాద్, ఎన్ ఎస్ యు ఐ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు..

## జోగిపేట్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

**ఆందోల్-జోగిపేట్, ఆగస్టు20 (సమ సమాజం):** జోగిపేటలో భారత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు శ్రీ దామోదర్ రాజనర్సింహ గారి ఆదేశాల మేరకు ఘనంగా జరిపారు.జోగిపేట పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం రాజీవ్ గాంధీ 78వ జయంతిని పురస్కరించుకొని కాంగ్రెస్ శ్రేణులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రజాప్రతినిధి ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు) మాట్లాడుతూ. రాజీవ్ గాంధీ ఐటి రంగంలో దిగ్గజమని ఆయన కొనియాడారు. 18 సంవత్సరాలకి ఓటు హక్కు తెచ్చిన ఘనత ఆయనదని గుర్తుచేశారు. ఆయన కల్పించిన ఓటు హక్కుతో ప్రతి ఒక్కరు ప్రభుత్వాలను ప్రశ్నించే హక్కును మనకు ఇవ్వడం గొప్ప వరమన్నారు. భారత మాజీ దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ ఆపు ఈనాడు ఐటీ రంగంలో ఎంతోమంది దిగ్గజాలు తయారు కావడం రాజీవ్ గాంధీ పుణ్యమే అన్నారు.ఆయనకు పైలెట్ పైన తప్ప రాజకీయాల పట్ల ఆసక్తి లేకుండే కానీ. పెద్దల దీవెనలతో రాజకీయంలోకి చేరి రాజకీయంపై మక్కువ ఏర్పరచుకొని అతి తక్కువ కాలంలోనే ఐటీ రంగాన్ని ముందుకు తీసుకెళ్లి ప్రజల్లో అవగాహన కల్పించిన వ్యక్తి రాజీవ్ గాంధీ అన్నారు. మన మధ్యలో లేని రాజీవ్ గాంధీ ఇప్పుడు ఉండుంటే సోనియమ్మకు మనందరికీ అండగా ఉండేవారని ప్రధానమంత్రిగా కూడా కొనసాగా వారిని ఆయన ఈ సందర్భంగా కొనియాడారు. ఇప్పుడు కూడా రాజీవ్ గాంధీ పేరు చెప్తే ఐటీరంగమే గుర్తొస్తుందని ఆయన అన్నారు.మనమందరం ఇలాగే ఐక్యతగా ముందుకు సాగాలని సోనియమ్మ ఆదేశాల మేరకు పనిచేస్తూ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేద్దామన్నారు. రాబోయే ఎన్నికల్లోఆయనకు పైలెట్ పైన తప్ప రాజకీయాల పట్ల ఆసక్తి లేకుండే కానీ. పెద్దల దీవెనలతో రాజకీయంలోకి చేరి రాజకీయంపై మక్కువ ఏర్పరచుకొని అతి తక్కువ కాలంలోనే ఐటీ రంగాన్ని ముందుకు తీసుకెళ్లి ప్రజల్లో అవగాహన కల్పించిన వ్యక్తి రాజీవ్ గాంధీ అన్నారు. మన మధ్యలో లేని రాజీవ్ గాంధీ ఇప్పుడు ఉండుంటే సోనియమ్మకు మనందరికీ అండగా ఉండేవారని ప్రధానమంత్రిగా కూడా కొనసాగా వారిని ఆయన ఈ సందర్భంగా కొనియాడారు. ఇప్పుడు కూడా రాజీవ్ గాంధీ పేరు చెప్తే ఐటీరంగమే గుర్తొస్తుందని ఆయన అన్నారు.మనమందరం ఇలాగే ఐక్యతగా ముందుకు సాగాలని సోనియమ్మ ఆదేశాల మేరకు పనిచేస్తూ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేద్దామన్నారు. రాబోయే ఎన్నికల్లో మన దామోదర రాజనర్సింహను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జోగిపేట మండల అధ్యక్షులు శివరాజ్, కౌన్సిలర్లు సురేందర్ గౌడ్, హరికృష్ణ గౌడ్, మాజీ కౌన్సిలర్ ప్రదీప్ గౌడ్, నాయకులు రాజిరెడ్డి, శ్రీనివాస్, అబ్బాస్, కోశికే రాజశేఖర్, నాగరాజు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# మతోన్మాద బిజెపిని ఓడించేందుకే మద్దతు


**మునుగోడు వేదిక నుంచి సిపిఐ నేత పల్లా వెంకట్ రెడ్డి**



**నల్లగొండ, ఆగస్టు 20 (సమ సమాజం):** మతోన్మాద బీజేపీని ఓడించేందుకు .. మునుగోడు ఉపెన్నికలో టీఆర్ఎస్ కు మద్దతు ఇస్తున్నామని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి ప్రకటించారు. మునుగోడు టీఆర్ఎస్ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఒక్కరోజు కూడా మునుగోడు అభివృద్ధి గురించి కానీ.. నియోజకవర్గ ప్రజా సమస్యల గురించి కానీ ఆలోచించలేదన్నారు. ఇప్పుడు మునుగోడు ఉప ఎన్నిక అవసరం లేదు. కానీ రాష్ట్రంలో పాగా వేయాలనే దురుద్దేశంతో.. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డితో బీజేపీ రాజీనామా చేయించింది. ఆ ఫలితంగానే మునుగోడు లో బైపోల్ వచ్చింది. కాంగ్రెస్ పార్టీ పతనం అవుతోందనడానికి ఈ పరిణామం నిదర్శనం అని పల్లా వెంకట్ రెడ్డి వ్యాఖ్యానించారు. అమిత్ షా కాదు.. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వచ్చినా ఈ నియోజకవర్గంలో బీజేపీ గెలవలేదు అని అభిప్రాయపడ్డారు. సీఎం కేసీఆర్ ఆహ్వానం మేరకు తాను ఈ సభకు హాజరైనట్లు పల్లా వెంకట్ రెడ్డి చెప్పారు. కమ్యూనిస్టు పార్టీ గతంలో ఐదు పర్యాయాలు మునుగోడు నుంచి గెలిచింది. ఇప్పుడు మాత్రం ఎందుకు టీఆర్ఎస్ తో చేతులు కలుపుతోంది అంటూ కొన్ని మీడియాలలో కథనాలు వస్తున్నాయి. మతోన్మాద శక్తులను ఓడించే సంకల్పంతో మేం టీఆర్ఎస్ కు అండగా నిలుస్తున్నం అని ఆయన ఈసందర్భంగా స్పష్టం చేశారు. గతంలో మేం కాంగ్రెస్ మద్దతుతో మునుగోడులో గెలిచాం. అయినా 2004 నుంచి 2009 వరకు తెలంగాణ సాధన ఉద్యమంలో భాగంగా టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు రాజీనామా చేసి.. ఉప ఎన్నికలకు వచ్చినప్పుడల్లా మేం టీఆర్ఎస్ నే బలపర్చాం. ఇటీవల హుజూరాబాద్, నాగార్జున సాగర్ ఉప ఎన్నికల్లోనూ టీఆర్ఎస్ కే మద్దతు పలికాం అని పల్లా వెంకట్ రెడ్డి గుర్తుచేశారు. ప్రజా సమస్యలను మరిస్తే ఎవరినైనా ప్రశ్నిస్తం. మా పోరాటం కేసీఆర్ ను గద్దె దించేందుకు కాదు.. ప్రజా సమస్యలకు పరిష్కారాన్ని సాధించేందుకు మాత్రమే. భవిష్యత్తులోనూ టీఆర్ఎస్ తో కలిసి పనిచేస్తం అని చెప్పారు. రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శత్రువులు ఉండరని అంటూ ఎప్పుడు ఏది ప్రజలకు అవసరమో ఆ నిర్ణయం తీసుకుంటున్నామని అన్నారు.

# మునుగోడుకు భారీగా తరలిన టీఆర్ఎస్ శ్రేణులు

**జెండా ఊపి పంపిన మంత్రి తలసాని**



**హైదరాబాద్, ఆగస్టు 20 (సమ సమాజం):** మునుగోడులో టీఆర్ఎస్ ప్రజా దీవెన సభకు మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు పెద్దఎత్తున తరలి వెళ్లారు. నగరం నుంచి మునుగోడుకు వెళ్తున్న భారీ కాన్వాయ్‌కి నెక్లెస్ రోడ్ వద్ద మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ.. తెలంగాణ అభివృద్ధిపై ఎక్కడైనా చర్చకు సిద్ధమన్నారు. మునుగోడులో విజయం టీఆర్ఎస్ పార్టీదేనని స్పష్టం చేశారు. ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారని చెప్పారు. తెలంగాణలో టిఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమయ్యిందన్నారు. బిజెపితో ఒరిగేదేమీ లేదన్నారు. చివరకు మన కరెంట్‌పై కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. సిట్టింగ్ ఎమ్మెల్యే చేతకాని తనం వల్లే ఉప ఎన్నిక వచ్చిందని విమర్శించారు. కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతున్నదని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. కోమటిరెడ్డి బ్రదర్స్‌ను టీఆర్ఎస్‌లో చేరాలని ఆహ్వానించానని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలంటే సీనియర్లంతా టీఆర్ఎస్‌లో చేరాలని పిలుపునిచ్చారు.ఖైరతాబాద్, కూకట్‌పల్లి, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల నుంచి మూడు వందల చొప్పున కార్లలో టీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు మునుగోడుకు బయల్దేరారు. మొత్తంగా ఐదు వేలకుపైగా కార్లతో హైదరాబాద్ నుంచి మునుగోడుకు భారీ ర్యాలీ జరుగనుంది.

# సిబిఐ దాడులపై ఆప్, బిజెపిల మధ్య మాటల యుద్ధం

**కేజ్రీవాల్‌ను టార్గెట్ చేసారన్న ఆప్ ఆరోపణలు**

**వారిది అపంబద్ధ ఆరోపణలు అన్న అనురాగ్ ఠాకూర్**



**న్యూఢిల్లీ, ఆగస్టు 20 (సమ సమాజం):** సిబిఐ దాడులతో మాటల యుద్ధం చోటుచేసుకుంది. బిజెపి తీరును ఆప్ ఎండగట్టగా, అందుకు బిజెపి నేతలు కూడా ఎదురుదాడికి దిగారు. మద్యం పాలసీ కేసులో ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియాపై సీబీఐ దాడుల నేపథ్యంలో ఆప్ నేతలు కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ప్రధాని నరేంద్ర మోదీ ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను నెంబర్ వన్ టార్గెట్‌గా ఎంచుకన్నారని ఆప్ ప్రతనిధి సౌరవ్ భరద్వాజ్ ఆరోపించారు. 31 ప్రదేశాల్లో సీబీఐ చేపట్టిన విస్తృత దాడుల్లో ఏం స్వాధీనం చేసుకున్నారో సీబీఐ వెల్లడించాలని డిమాండ్ చేశారు. 900 మంది ఐటీ సిబ్బంది దాడుల్లో పాల్గొని ఏం నిగ్గుతేల్చారో తెలపాలని కోరారు. గతంలో సీబీఐని దుర్వినియోగం చేస్తున్నారని పాత వీడియోల్లో వాపోయిన మోదీ ఇప్పుడు విపక్షాలపై ప్రయోగిస్తూ ప్రతిపక్షాలను వీలైనంత ఇబ్బంది పెట్టాలని దర్యాప్తు ఏజెన్సీలను ప్రేరేపిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అగ్రనేతల నుంచి సీబీఐపై తీవ్ర ఒత్తిడి ఉందని ఆరోపించారు. మరోవైపు మనీష్ సిసోడియా మద్యం పాలసీ కేసులో నెంబర్ వన్ నిందితుడే అయినా ఈ స్కాం వెనుక ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ప్రధాన సూత్రధారిగా ఉన్నారని కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ ఆరోపించారు. కేజ్రీవాల్ మీడియా ముందుకు వచ్చి 24 గంటల్లోగా తనకు జవాబివ్వాలని అనురాగ్ ఠాకూర్ సవాల్ విసిరారు. విలేకరుల సమావేశానికి హాజరైన మనీష్ సిసోడియాకు ముఖం చెల్లలేదని, ఆయన ఏ ప్రశ్నకూ బదులివ్వలేదని అన్నారు. మనీష్ సిసోడియాకు కేవలం మనీ వ్యామోహంతో డబ్బు తీసుకుని మౌనంగా ఉంటున్నాడని ఎద్దేవా చేశారు. ఢిల్లీ రాష్ట్ర ఎక్సయిజ్ విధానం కుంభకోణం అసలు సూత్రధారి ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అని కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ ఆరోపించారు. ఈ కుంభకోణంపై దర్యాప్తులో భాగంగా సీబీఐ శుక్రవారం సోదాలు నిర్వహించి, ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాతోపాటు 15 మందిపై కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. మనీశ్ సిసోడియా శనివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, రానున్న లోక్‌సభ ఎన్నికలు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ మధ్య జరుగుతాయన్నారు. ఎక్సయిజ్ పాలసీ అమలులో ఎటువంటి అవినీతి జరగలేదన్నారు. రాష్ట్రంలో విద్య, ఆరోగ్య రంగాలు మెరుగుపడ్డాయన్నారు. రాష్ట్రంలో పాఠశాలలు మెరుగుపడటానికి కారణం తాను కాదని, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులేనని, తాను వారికి ధన్యవాదాలు చెప్తున్నానని తెలిపారు. ఈ నేపథ్యంలో అనురాగ్ ఠాకూర్ మాట్లాడుతూ, ఎక్సయిజ్ పాలసీ కుంభకోణంలో మనీశ్ సిసోడియా మొదటి నిందితుడు కావచ్చునని, అయితే అసలు సూత్రధారి ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అని ఆరోపించారు. విలేకర్ల సమావేశంలో సిసోడియా ముఖాన్ని పరిశీలించినపుడు, ఈ కుంభకోణం వెలుగులోకి వచ్చిన తర్వాత ఆయన ముఖం ఏవిధంగా వివర్ణమైందో, కళ తగ్గిందో స్పష్టంగా అర్థం చేసుకోవచ్చునని తెలిపారు. ఆయన ఏ ప్రశ్నకూ సమాధానం చెప్పలేకపోతున్నారన్నారు. కేజ్రీవాల్ 24 గంటల్లోగా ప్రజల ముందుకు వచ్చి జవాబు చెప్పాలని సవాల్ విసిరారు. ఆయన డబ్బు సంపాదించుకుంటూ, మౌనంగా ఉంటారన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికలు మోదీ, కేజ్రీవాల్ మధ్య జరుగుతాయని సిసోడియా చేసిన వ్యాఖ్యలపై అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ స్పందిస్తూ, ఎన్నికల్లో ప్రతిపక్షాల నేత అరవింద్ కేజ్రీవాల్ అయితే బీజేపీకి మంచిదే. ఎందుకంటే చాలా మంది ఆయన పేరును సైతం వినలేదు. మేం చాలా గొప్ప ఆధిక్యంతో గెలుస్తాం అని పేర్కొన్నారు.

# వనపర్తికి తలమానికంగా తిరుమలయ్యగుట్ట



**అరుదైన వనమూలికలకు ఇక్కడ ప్రసిద్ది**

**పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్న మంత్రి**

**వనపర్తి, ఆగస్టు 20 (సమ సమాజం):** తిరులమయ్య గుట్ట వనపర్తికే తలమానికమని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. శ్రావణమాసం సందర్భంగా తిరుమలయ్య గుట్టను మంత్రి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా తిరుమలేశుడిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత అంజనేయస్వామి ఆలయం వద్ద అన్నదానంలో పాల్గొన్నారు. భక్తులకు మంత్రి స్వయంగా వడ్డించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అరుదైన వనమూలికలకు తిరుమలయ్య గుట్ట అటవీప్రాంతం ప్రసిద్ధి అనీ, ఈ ప్రాంతంలో మరింత పెద్ద ఎత్తున మొక్కలను పెంచి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. తిరుమలయ్య గుట్ట చుట్టూ సుందరీకరణ గుట్ట పైకి వెళ్లేందుకు రహదారి వెంట మెట్లు ఏర్పాటు చేస్తామని, వాహనాలకు ఇబ్బంది లేకుండా, పాదాచారులకు ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపడుతామన్నారు. గుట్టమీద నీటి సౌకర్యం కల్పిస్తామని, వాహనాల పార్కింగ్‌కు శాశ్వత ఏర్పాట్లు చేస్తామన్నారు. అన్ని రంగాల్లో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని, అన్నివర్గాల సంక్షేమమే సీఎం కేసీఆర్ ఆకాంక్ష అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి సాయం అందుతుందన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతుబంధు, రైతుబీమా, కేసీఆర్ కిట్, అమ్మ ఒడి, ఆసరా పింఛన్లు తెలంగాణలోనే విజయవంతంగా అమలవుతున్నాయన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా, కేంద్ర ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా సంక్షేమ పథకాల అమలుకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తున్న ఘనత కేసీఆర్‌దేనన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 140 మంది లబ్దిదారులకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.44.52లక్షల విలువైన చెక్కులను అందజేశారు. మంత్రి వెంట జడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి ఉన్నారు.

# మరోమారు విద్యుత్ ఛార్జీలు పెంచే కుట్ర



**4వేల కోట్ల భారం మోపేందుకు కెసిఆర్ స్కెచ్**

**కేంద్రంపై విమర్శల వెనక కుతంత్రం ఇదే**

**పాదయాత్రలో ఘాటుగగా విమర్శలు గుప్పించిన బండి**

**జనగామ, ఆగస్టు 20 (సమ సమాజం):** రాష్ట్రంలో మరోసారి విద్యుత్ ఛార్జీలు పెంచేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రయత్నిస్తున్నారని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆరోపించారు. ప్రజలపై మరో రూ.4 వేల కోట్ల భారం మోపేందుకు కుట్ర చేస్తున్నారని ఆక్షేపించారు. అందుకే కేంద్రం ఎక్స్ఛేంజీలో విద్యుత్ విక్రయాలు ఆపేసిందని పేర్కొన్నారు. జనగామ జిల్లా ఖిలాషపూర్‌లో ప్రజా సంగ్రామ యాత్రలో ఆయన ఈ మేరకు మాట్లాడారు. మరోసారి కరెంట్ ఛార్జీలు పెంచేందుకు కేసీఆర్ కుట్ర చేస్తున్నారన్న బండి, మరోసారి కరెంట్ ఛార్జీలు పెంచి ప్రజలపై మరో రూ.4 వేల కోట్ల భారాన్ని మోపేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ కుట్ర చేస్తున్నారని పేర్కొన్నారు. కేసీఆర్ తీరు వల్ల విద్యుత్ సంస్థలకు రూ.60 వేల కోట్ల బకాయిలు పేరుకుపోయాయని తెలిపారు. తద్వారా కరెంట్ ఉత్పత్తి సంస్థలన్నీ మూతపడే దుస్థితి ఏర్పడిందని ఆక్షేపించారు. ఇదే పరిస్థితి కొనసాగితే.. రాష్ట్రమంతా చీకట్లు అలుముకునే ప్రమాదం ఉందన్నారు. ఈ దుస్థితి నుంచి బయటపడేసేందుకే కేంద్ర ప్రభుత్వం పవర్ ఎక్స్ఛేంజీల వద్ద విద్యుత్ కొనడాన్ని నిషేధిస్తూ నిర్ణయం తీసుకుందని స్పష్టం చేశారు. దమ్ముంటే.. డిస్కంలతో పాటు సింగరేణి, ఎన్టీపీసీ సంస్థలకు ఎన్నెన్ని బకాయిలున్నాయనే అంశంపై తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. కేసీఆర్‌ది ఒకటే ఆలోచన అని.. ఈ రాద్ధాంతం చేసి మళ్లీ కరెంట్ ఛార్జీలు పెంచే కుట్రకు సిద్ధమయ్యాడని విమర్శించారు. ఃష్ట్రంలో మరోసారి కరెంట్ ఛార్జీలు పెంచేందుకు కేసీఆర్ కుట్ర చేస్తున్నారు. ప్రజలపై మరో రూ.4 వేల కోట్ల భారం మోపేందుకు ప్రయత్నిస్తున్నారు. కేసీఆర్ తీరు వల్ల కరెంట్ ఉత్పత్తి సంస్థలన్నీ మూతపడే దుస్థితి ఏర్పడింది. ఇదే పరిస్థితి కొనసాగితే.. రాష్ట్రమంతా చీకట్లు అలుముకునే ప్రమాదం ఉంది. ఈ దుస్థితి నుంచి బయట పడేసేందుకే కేంద్ర ప్రభుత్వం పవర్ ఎక్స్ఛేంజీల వద్ద విద్యుత్ కొనడాన్ని నిషేధిస్తూ నిర్ణయం తీసుకుంది. రేపు జరగబోయే కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభను దిగ్విజయవంతం చేయాలి. ఈసారి మునుగోడు ప్రజలంతా భాజపావైపే ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ మునుగోడు ప్రజలకు పొర్లు దండాలు పెట్టినా ఎవరూ ఓటెయరని అన్నారు. మునుగోడులో ఆదివారం జరగబోయే కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభను దిగ్విజయవంతం చేయాలని బండి సంజయ్ ప్రజలను కోరారు. కాంగ్రెస్ పార్టీ మునుగోడు ప్రజలకు పాదాభివందనమే కాదు.. పొర్లు దండాలు పెట్టినా ఎవరూ ఓటెయరని మండిపడ్డారు. ఈసారి మునుగోడు ప్రజలంతా భాజపావైపే ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు.

# పైసా ఖర్చు లేకుండా పేదలకు డబుల్ ఇళ్లు

**కాంగ్రెస్ హయాంలో బేస్‌మెట్ దగ్గరే ఆగిపోయాయి**

**బిజెపితో తెలంగాణకు ఒరిగిందేమీ లేదు**

**పాలమాకులలో ఇళ్లను ప్రారంభించిన మంత్రి హరీష్**

**సిద్దిపేట, ఆగస్టు 20 (సమ సమాజం):** రూపాయి ఖర్చు లేకుండా, ఎలాంటి పైరవీలకు తావులేకుండా ప్రతి పేదోడికి ఇల్లు అందించడమే టీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి హరీశ్ రావు అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా నిరుపేదలకు రెండు పడకల ఇళ్లు అందిస్తున్నామని చెప్పారు. జిల్లాలోని పాలమాకులలో కొత్తగా నిర్మించిన 23 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను మంత్రి హరీశ్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. త్వరలోనే సొంతజాగాలో ఇళ్లు కట్టుకునే వారికి రూ.3 లక్షలు ఆర్థిక సాయం అందిస్తామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇండ్ల నిర్మాణం కోసం ఇచ్చే పైసలు బేస్‌మెంటుకు కూడా సరిపోయేవి కాదని విమర్శించారు. కానీ తెలంగాణ ప్రభుత్వం పైసా ఖర్చు లేకుండా ఇళ్లు కట్టించి తాళం చేతిలో పెట్టి లబ్దిదారులకు అప్పగిస్తున్నామన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక ఏ వర్గం బాగుపడ్డదో, ఎవరికి లాభం జరిగిందో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అన్ని వర్గాలకు మంచి చేయడమే టీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. దేశంలో ఏ రాష్ట్రంలో జరగని అభివృద్ధి కార్యక్రమాలు తెలంగాణలో జరుగుతున్నాయని చెప్పారు. బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ ఉందా అని ప్రతిపక్షాలను ప్రశ్నించారు. పేదలకు ఉచితాలు ఇవ్వొద్దంటున్న కేంద్రంలోని ప్రధాని మోదీ ప్రభుత్వం.. పారిశ్రామికవేత్తలకు రూ.10 లక్షల కోట్లు మాఫీ చేసిందని విమర్శించారు. సీఎం కేసీఆర్ రాష్ట్ర ప్రజలు ఆదాయం పెంచుతున్నారని, బీజేపీ మాత్రం ప్రజల సొమ్మును ధనవంతులకు పంచుతున్నదని దుయ్యబట్టారు. త్వరలో అర్హులైన అందరికీ కొత్త పెన్షన్లు అందిస్తామని, సీఎం కేసీఆర్ వచ్చాక ఆసరా పెన్షన్లు, నిరంతర ఉచిత కరెంటు, ఆడపిల్ల పెళ్లికి ఆర్థిక సాయం చేసుకుంటున్నామంటూ.. ఏ పైరవీ చేయకుండానే షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మితోనే ఆడపిల్ల పెళ్లి చేసుకుంటున్నారని వివరించారు. కానీ ఢిల్లీ బీజేపీ ఉచితాలు వద్దని, కల్యాణ లక్ష్మి, రైతుబంధు, రైతుభీమా, ఆసరా పెన్షన్ వద్దని స్వయంగా దేశ ప్రధాని చెప్తుంటే ప్రజలేమవాలనీ నిలదీశారు. రైతులకు 24 గంటల ఉచిత రావాల్సిన కరెంటును కేంద్రం కట్ చేసిందని విమర్శించారు. బాయికాడ మీటర్లు పెడితే ఈ ఆర్థిక సంవత్సరం రూ.65 వేల కోట్లు ఇస్తామని ఆశ చూపిందన్నారు. అయినప్పటికీ సీఎం కేసీఆర్ బావుల మీటర్లకు ఒప్పుకోలేదని చెప్పారు. తెలంగాణలో కోతలు లేకుండా నాణ్యమైన కరెంటు రైతులకు అందిస్తుంటే బీజేపీ నేతలకు కళ్లు మండి అడ్డుపడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.




# చలన చిత్రం



## ఆ రోజెందుకు స్పందించలేదు మేడమ్

కారీనాకు కాశ్మీర్ ఫైల్స్ డైరెక్టర్ కౌంటర్

అత్యంత భారీ బ్జడెట్ తో నిర్మించిన లాల్‌సింగ్ చద్దా మూవీ 'బాయ్ కాట్ ' ట్రెండ్ కారణంగా తీవ్రంగా నష్టపోయింది. సినిమా రిలీజ్ కు రెండు వారాల ముందు నుంచి ఈ మూవీని బాయ్ కాట్ చేయాలంటూ నెట్టింట ట్రోలింగ్ మొదలైన విషయం తెలిసిందే. దీనిపై హీరోయిన్ కరీనా కపూర్ ఘాటుగా స్పందించింది. ఈ సినిమా ప్రమోషన్స్ లో భాగంగా ఓ మీడియాతో మాట్లాడుతూ కరీనా కపూర్ విచారం వ్యక్తం చేసింది. సినిమా వసూళ్లు పడిపోవడం పల్ల ఆవేదన వ్యక్తం చేసింది. 'లాల్ సింగ్ చడ్డా' మంచి సినిమా అని ఇలాంటి చిత్రాన్ని ఎందుకు బాయ్ కాట్ చేస్తున్నారో అర్థం కావడం లేదని పేర్కొంది. అంతే కాకుండా ఈ మూవీ కోసం దాదాపు 250 మంది ఎంతో శ్రమించారని వాపోయింది. అయితే ఈ వ్యాఖ్యలపై 'ది కశ్మీర్ఫైల్స్' దర్శకుడు వివేక్ అగ్నిహోత్రి కాస్త ఘాటుగా స్పందించాడు. బాలీవుడ్ డాన్ లుగా నటులు వ్యవహరించి హిందూ ఫోబియాతో చిన్న సినిమాలు రిలీజ్ కాకుండా ఆగిపోయినప్పుడు మీరెక్కడికెళ్లారు అని ప్రశ్నించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఆయన సంచలన ట్విట్ లు చేశారు. చిన్న సినిమాలు.. మంచి కంటెంట్ వున్న మూవీస్ ను బాలీవుడ్ డాన్ లుగా పిలవబడే నటులు అడ్డుకున్నప్పుడు ఆ సినిమాలకు థియేటర్లు ఇవ్వకుండా ఆపేసినప్పుడు మీరెందుకు స్పందించలే దన్నాడు. అలా బాలీవుడ్ డాన్ లు గా పిలవబడే కొందురు నటుల కారణంగా ప్రతిభ వున్న నటులు దర్శకులు రచయితల జీవితాలు నాశనమయ్యాయి కదా? ఆ సినిమాలకు కూడా పని చేసింది 250 మంది పేద ప్రజలే అంటూ గట్టి కౌంటర్ ఇచ్చారు. అంతే కాకుండా మరో ట్వీట్ లో బాలీవుడ్ డాన్ ల అహంకారం హిందూ ఫోబియా గురించి భారతీయులకు తెలినప్పుడు వారిని వేడి కాఫీలో ముంచేస్తారు' అంటూ ఫైర్ అయ్యారు. ప్రస్తుతం వివేక్ అగ్నిహోత్రి సోషల్ మీడియా వేదికగా చేసిన ఘాటు వ్యాఖ్యలకు సంబంధించిన ట్వీట్ లు ప్రస్తుతం నెట్టింట వైరలల్ గా మారాయి.



## పెళ్లి వార్తలను మరోమారు ఖండించిన నిత్యా మీనన్

### పెళ్లి చేసుకోవాలని దుల్కర్ కూడా సూచించడాని వెల్లడి

హీరోయిన్ నిత్యామీనన్ గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన పనిలేదు. విభిన్నమైన పాత్రలతో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకున్న ఈ బ్యూటీ పెళ్లి వార్తలపై గత కొంతకాలంగా వార్తలు చక్కర్లు కొడుతున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే వీటిపై ఆమె క్లారిటీ ఇచ్చినా రూమర్స్ మాత్రం ఆగడం లేదు. తాజాగా దీనిపై స్పందించిన నిత్యామీనన్ తన పెళ్లి గురించి వస్తోన్న వార్తల్లో ఏమాత్రం నిజం లేదని తేల్చేసింది.పెళ్లి చేసుకుంటుంది కాబట్టే కథలు వినట్లేదు అని రూమర్స్ పుట్టించారు' అని తెలిపింది. మరి పెళ్లి చేసుకోమని దుల్కర్ మీకు సూచించారట కదా అని అడగ్గా..'తను నాకు మంచి ఫ్రెండ్. అందుకే పెళ్లి చేసుకొని ఫ్యామిలీతో సంతోషంగా ఉండమని నాకు చెబుతుంటాడు. ప్రస్తుతానికి నాకు పెళ్లి ఆలోచన లేదు కానీ భవిష్యత్తులో చేసుకుంటానేమో తెలీదు' అంటూ చెప్పుకొచ్చింది. ఇక ఇటీవలి కాలంలో తనపై వస్తున్న రూమర్స్‌పై స్పందిస్తూ..నేను ఇండస్ట్రీలో ఎప్పుడూ ఎదుర్కొనే ఇబ్బంది ఏంటంటే..'నన్ను ఇండస్టీ బ్యాన్ చేసిందనే వార్తలు పుట్టించారు. కావాలనే తప్పుగా ప్రచారం చేశారు. మనం మంచి స్థాయిలో ఉన్నప్పుడు మనల్ని కిందకి లాగాలని చాలామంది ప్రయత్నిస్తుంటారు. అందరి గురించి నేను ఆలోచిస్తూ పోతే నా పనులు చేసుకోవడానికి సమయం దొరకదు' అన్నారు




## భారీగా కలెక్షన్లను రాబడుతున్న కార్తికేయ-2

నిఖిల్ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్‌గా కార్తికేయ-2 నిలిచింది. ప్రస్తుతం ఇండియాలో 'కార్తికేయ-2' హవా నడుస్తుంది. భారీ అంచనాల నడుమ ఈనెల 13న విడుదలైన ఈ చిత్రం ఇండియన్ బాక్సాఫీస్ దగ్గర సంచలనం సృష్టిస్తుంది. విడుదలైన మూడు రోజుల్లోనే బ్రేక్ ఈవెన్ పూర్తి చేసుకుని కంటెంట్ పవర్ ఎంటో తెలియజేసింది. ప్రస్తుతం ఇండియాలో ఏ థియేటర్‌లో చూసిన ఈ సినిమా ఆడుతోంది. ముఖ్యంగా నార్త్‌లో ఈ సినిమాకు రోజురోజుకు విపరీతమైన క్రేజ్ పెరుగుతుంది. హిందీ బెల్ట్‌లో మొదటి రోజు 50 స్క్రీన్లలో విడుదలైన ఈ చిత్రం ఇప్పుడు ఏకంగా 1000 స్క్రీన్‌లకు పైగా ప్రదర్శితమౌవుతుంది. ఇప్పటికే లాల్ సింగ్ ఛడ్డా, రక్షా బంధన్ థియేటర్‌లను కార్తికేయ-2 ఆక్యూపై చేసింది. విడుదలైన ప్రతి భాషలో కార్తికేయ-2 డబుల్ బ్లాక్ బాస్టర్‌గా నిలిచింది. తాజాగా ఈ చిత్రం 60కోట్ల గ్రాస్‌ను కలెక్ట్ చేసింది. ఈ చిత్రంతో నిఖిల్ 60కోట్ల క్లబ్‌లో అడుగుపెట్టాడు. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు ఈ చిత్రం రూ. 28.03 కోట్ల షేర్‌ను రాబట్టింది. బాలీవుడ్‌లో ఈ సినిమా కలెక్షన్‌లు రోజు రోజుకు పెరుగుతూనే ఉన్నాయి. బాహుబలి, పుష్ప తర్వాత ఆ స్థాయిలో బాలీవుడ్‌లో కార్తికేయ-2 దూసుకుపోతుంది. ఈ చిత్రంతో హీరో నిఖిల్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది.అడ్వేంచర్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రానికి చందూ మొండేటి దర్శకత్వం వహించాడు. నిఖిల్‌కు జోడీగా అనుపమ పరమేశ్వరణ్ హీరోయిన్‌గా నటించింది. బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్ కీలకపాత్రలో నటించాడు

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at Panidhar **PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in